# నా గొడవ...

పదవ తరగతి వరకూ నాకు యెప్పుడూ సాంఘిక శాస్త్రంలో చాల యెక్కువ మార్కులు వచ్చేవి. తళ్లికోట యుద్ధం, పానిపట్టు యుద్ధం, తంజావూరు విజయం, గోల్కొండ పతనం - అన్నీ తారీఖుల్తోసహా టకటకా చెప్పేసేవాడిని. నా చరిత్ర పరిజ్ఞానానికి నన్నందరూ ఆకాశానికెత్తేసేవారు. కానీ, చరిత్రంటే యీ తారీఖులూ, దస్తావేజులూ కాదని, మతలబులూ, కైఫీయతులూ కాదని నాకు తెలియడానికి పదవ తరగతి తర్వాత మరో పదేళ్లు పట్టింది. పురాణాల, యితిహాసాల చీకటి నీడలో మరుగునబడిన కథలన్నీ దొరికితేనే తప్ప దాచేసిన సత్యాలు తెలియవన్నది తెలిసింది.

ఆ తెలియడం మొదలయిన తర్వాత యింక చాలా తెలిసాయి...

నిచ్చెనమెట్ల సమాజంలో నా యెదుగుదలకు నా సామాజిక నేపథ్యం యెంత కారణమో, చిన్నప్పుడు నాతోనే చదివిన సాయిలు యిక ముందుకీదలేకపోవడానికి వాడి సామాజిక నేపథ్యమూ అంతే కారణమని తెలిసింది. తన వళ్లు గుల్లచేసుకుని మా యింట్లో పనిచేసేవాడిని అందరూ పెంటిగా అంటే నేను పెంటప్పా అనడం 'వాడి' పట్ల జాలేకానీ నా మంచితనం కాకపోవడానికి మూలం నేను పుట్టిన, పెరిగిన వాతావరణంలో వుందన్నది తెలిసింది.

యీ తెలివిడికి మూలం - యండమూరి, మల్లాదిలను చదివేస్తూ హాయిగా బతుకుతున్న నాతో వో మైదానం, వో అమ్మ, వో దిటవు గుండెలు చదివించింది రాణి అనే వో స్నేహితురాలు. నేను తిరిగి జనించడం అప్పుడు జరిగింది.

యిప్పటి నేను -

రాజకీయాల్లో చేరుతున్నప్పుడు 'రెడ్డి' తోక తీసెయ్యమని మిత్రులు చెపితే - అది prideతో కాదు, నా యీ వుచ్చస్థితికి నా స్వయంప్రతిభకంటే కూడా నేను రెడ్డిని అవ్వడం చాలా కారణం, అది అందరికీ తెలియడం అవసరమని ఆ తోకను అలాగే వుంచాను. నాకు కులసంఘాలు అంటే అసహ్యం. కమ్మ సంఘాలూ, రెడ్డి సేవా సమితుల్నీ నిషేధించాలని నా స్థిరాభిప్రాయం. కానీ... తరాలుగా అణచివేతకు గురవుతున్న కిందికులాల పోరాటం, వారి ఆత్మవిశ్వాసం నాకు యెప్పుడూ స్ఫూర్తినిస్తాయి. మంద కృష్ణమాదిగ నా హీరో! మాదిగ కుల సంఘాలూ మాలల కుల సంఘాలూ యింకా అనేక యితర అణచబడుతున్న కిందికులాల సంఘాలూ వర్ధిల్లాలి.

త్రిశ్రీ పైడిశ్రీని పరిచయం చేస్తునే - యెవడిపాట వాడే పాడుకోవాలి అన్నప్పుడు మరి మనమేం చెయ్యాలనే డౌటొచ్చింది...

హో! అంటూ తిరుపతిని హోరెత్తిస్తూ ఎద్దుకూర బిర్యానీ తింటున్నప్పుడో, చలపతీ విజయవర్ధనాలకు వురిశిక్ష తప్పించిన విజయానందంలోనో, అంతకు ముందెన్నడో నా కులాన్ని డిసోన్ చేసుకున్నప్పటికీ చుండూరు, కారంచేడుల్లో అగ్రకుల వుగ్రరూపం నన్ను వెంటాడుతూ, నాకు నిద్దర కరువుచేస్తూ, నన్ను పీడిస్తూనే వుంది.

· 27 atrocities against Dalits every day · 13 Dalits murdered every week
· 5 Dalits' homes or possessions burnt every week · 6 Dalits kidnapped or abducted every week
· 3 Dalit women raped every day · 11 Dalits beaten every day
· A crime committed against a Dalit every 18 minutes·

యీ లెక్కలు, లెక్కకు మించిన దౌర్జన్యాలూ యెందుకు జరుగుతున్నాయి. కిందికులాలు నిమ్నకులాలుగా యెందుకున్నాయి. తరతరాల పీడన యింకెంతకాలం? కులవివక్ష నిర్మూలనకు యెవరేం చెయ్యాలి? యెందుకు చెయ్యాలి. యీ ప్రశలన్నిటికీ పూర్తిసమాధానం దొరకకపోయినా - యివి వెయ్యాల్సి ప్రశ్నలేనని, యింకా వెయ్యడం తెలియనంతగా ప్రశ్నలున్నాయనీ సౌదా అపూర్వ పురాణకథలు చదివినప్పుడు అనిపించింది. బర్బరీకుడు నాటకం చూస్తున్నప్పుడు confirm అయింది. ధర్మాధర్మాల మీమాంస తొలిగిపోయిందిప్పుడు. నేను హిందువునెట్లయితనో తెలిసింది. నాన్‌హిందువుల మిత్రుడినెట్లవ్వాల్నో తెలిసొస్తోంది. Hats off to Sauda Aruna.

యెక్కడ బర్బరీకుడు నాటక ప్రదర్శన వున్నా యేదోమేరకు యేదోరూపంలో పనిచేస్తూ నా అగ్రకుల giltyness నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నాను - of course, నాటకపు true valueని appreciate చేస్తూనే!

సౌదాకు సమకాలికుడినయినందుకు గర్వంగా, పాపపరిహారంకోసం యేం చెయ్యడానికైనా సిద్ధంగా వున్నానని వినమ్రంగా -



- శ్రీశైల్ రెడ్డి పంజుగుల

12 మార్చి 2008, హైదరాబాద్